'స్వాతి' మాసపత్రిక - ఫిబ్రవరి 1982

# చుట్టాలు

"ఏవండీ, చిన్నమాట" రహస్యంగా పిలుస్తున్నట్టు, అతి నెమ్మదిగా పిలిచింది సరోజ వంటగదిలోంచి.

పేపరు చదువుతున్న సూర్యం పేపరులోంచి తలెత్తేడు. ఏమిటన్నట్టు చూసేడు. అంతేగాని కుర్చీలోంచి కదిలి పెళ్ళం దగ్గరికి పరిగెట్టలేదు.

'ఏం, మనిషి' అనుకుంటూ తనే దగ్గరికి వచ్చింది. వచ్చి "మా అమ్మ ఈ రోజు మెయిలుకి వెళిపోతానంటోంది. అంచేత..." అంటూ ఏదో చెప్పబోతున్న సరోజను పూర్తిగా చెప్పనీయకుండానే అందుకున్నాడు సూర్యం-

"అదేం! వచ్చింది మొన్ననే కదా! అప్పుడే వెళ్ళిపోవడం ఏవిఁటీ? మనం వేసుకున్న ప్రోగ్రాం గుర్తుందా. మూడు గంటలు చేసి బయల్దేరి ఫోర్టుని చూద్దామనుకున్నావాఁ. అక్కణ్ణించి వెంకటేశ్వర టెంపుల్‌కి వెళ్ళి అలా పామ్‌బీచ్ అదీ మీ అమ్మకి చూపిద్దామను కున్నావాఁ. రేపు తెల్లారి లేచి సింహాచలం వెళ్దామనుకున్నావాఁ. అందుకు నేనీ రెండు రోజులూ సెలవు పెట్టి, ఫోర్టు చూడ్డానికి పర్మిషన్ పెట్టి... ఇంతా చేస్తే వెళ్ళిపోవడం ఏవిఁటి? రెండు

రోజులుండమని చెప్పు సరూ! కూతుర్వి ఆ మాత్రం చెప్పలేవూ!... పోనీ నన్ను చెప్పమంటావా.. ఏరీ అత్తగారు?"

కుర్చీలోంచి లేచేడు.

"స్నానం చేస్తోంది" అంది సరోజ.

కూర్చుండిపోయేడు సూర్యం.

అది బాత్‌రూమ్ అయిపోయింది గాని లేకుంటే సూర్యం నిజంగానే పరిగెట్టే మనిషని సరోజకి తెల్సు. అలాంటి మనిషనే గదా 'చిన్నమాట' అంటూ చెప్పడానికొచ్చింది.

కానేదీ చెప్పనిస్తేనా?

"మీ గొడవ మీదేగాని... నన్ను పూర్తిగా చెప్పనీయరా?"

సరోజ చిరాకుని గమనించి, చిన్నగా నవ్వేసి, పేపరు అవతలికి పారేసి, బుద్ధిగా చేతులు కట్టుకొని - "చిత్తం చెప్పండి సార్" అన్నాడు సూర్యం.

అటూ ఇటూ చూసింది. మూడేళ్ళ కొడుకు పక్క వాటాలోకి పోయి ఆడుకుంటున్నాడు. పది నెలల పాప ఉయ్యాల్లో నిద్రపోతోంది. తల్లి స్నానం చేస్తున్న బాత్‌రూమ్ ఈ గదికి అటాచ్‌డు కాదు. మూడు వాటాలకీ కలిపి ముచ్చటగా ఒకే ఒక బాత్రూమ్, ఈ గదికి ఇరవై గజాల దూరంలో వుంది. అయినా చాలా నెమ్మదిగా చెవిలో ఊదింది -

"మా అమ్మ ఈ రోజు మెయిల్‌కి వెళ్ళిపోతానంటోంది గాబట్టి వెళ్ళనీయండి! అంతేగాని ఫోర్టు, బీచు, సింహాచలం అంటూ రెండు రోజులుండండి అనే మెహర్బానీకి పోకండి దయచేసి"

నిర్ఘాంతపోయేడు సూర్యం!

"నీగ్గాని మతిపోయిందేవిఁటి?"

"నాకు మతేం పోలేదు గాని, దయచేసి నా మాట విని నేను చెప్పినట్టు చేయండి మీకు పుణ్యముంటుంది. మీరు నన్ను రాక్షసి ననుకోండి. కర్కోటకురాల్ననుకోండి ఏమనుకున్నా నేను బాధపడను. కాని బయల్దేరుతున్న మా అమ్మని ఆపకండి. వెళ్ళనీయండి".

ఉయ్యాల్లో పాప కదుల్తుంటే ఊపడానికెళ్ళింది.

ఉయ్యాల ఊపుతూ "మీరిక అలా కూర్చుంటే అవదు, లేవండి" అంది భర్తతో.

"మధ్యాహ్నం మెయిలుకి ఇప్పట్నించే ఎందుకూ!"

"అయితే మధ్యాహ్నం దాకా కూర్చుంటారా!... నేను లెమ్మంటున్నది బజారుకి"

సుజాత బీరువా తీసి, ఇరవై రూపాయల నోటు అతని చేతికిచ్చింది.

బజారుకు బయలుదేరుతూ "ఏం తెమ్మంటావ్" అన్నాడు.

"ఓ పావుకేజి కోడి మాంసం తెండి చాలు"

"పావుకేజి ఏం సరిపోతుంది - మీ అమ్మకే రాదు"

"అదే సరిపోతుంది. అయినా నేను తెమ్మంటున్నది మా అమ్మకే"

"అది కాదు సరూ. అరకేజి తెస్తే అందరికి సరిపోతుంది కదా"

"అరకేజి ఏం ఖర్మ! కేజి తెచ్చి ఆ నోటు అవ్వగొట్టేయండి."

"ప్రతిదానికి ఎందుకు సరూ! అంత చిరాకు"

"చిరాక్కాపోతే ఏవిఁటండి. ఏదైనా ఎందుకంటున్నానో అర్థం చేసుకోరు మీరు. ఇంట్లో చూస్తే దేనికేది కనపడదు. ఇంకా పప్పులూ, వుప్పులూ కొనే కొనలేదు. జీతం చూస్తే అయిపోవచ్చింది. మళ్ళీ జీతాలంటే ఇంకా 15 రోజులుంది. నేనెందులోపడి చచ్చేది చెప్పండి. నా చేతిలో ఇపుడు వంద కూడా లేదు. ఆ వందనే ఈ నెలాఖరు దాకా యీడ్చు కొద్దాం అనుకుంటే - మీరు కానివ్వరు. అది కావాలి ఇది కావాలని అంటారు. కోడి మాంసం మీకేనేటండీ నాకు మాత్రం తినాలని లేదా... మీరు అర్థం చేసుకోరు. నిన్నటిది ఎందుకొచ్చిన ఖర్చు చెప్పండి. మా అమ్మని సినిమాకి తీసుకెళ్దామన్నారు. సినిమా అనగానే నేను సరదా పడిపోయి వూఁ కొట్టేశాను. ఖర్చు ఎంతయిందో తెల్సాండి! పద్దెనిమిది రూపాయలు! వదిలిపోయింది సినిమా సరదా! ఏ నెలకానెల అనుకోవడవేఁ వో యాభై మిగిల్తే... ఓ కట్టుడు చీర కొనుక్కుందామని. చీరలన్నీ చిరిగిపోయేయి. ఇంట్లో కట్టుకోడానికి సరైంది ఒకటీ లేదు. ఇవేం మీరు గమనించరు" అంటూ చీర కుచ్చిళ్ళలో దాగున్న చిరుగుల్ని భర్తకి చూపించింది. సంసారం ఈదడానికి ఆమె పడుతున్న వేదన ఆమె కన్నీళ్ళలో ప్రతిఫలించింది.

ఆ చిరుగులు చూసి, ఆ కన్నీళ్ళు చూసి 'సర్‌సర్లే, చీర కొంటాన్లే' అన్లేదు సూర్యం. పైగా "జీతం ఇంచుమించు అంతా నీ చేతుల్లోనే పెట్టేస్తున్నా కద సరూ" అన్నాడు.

"పెడితే తినేస్తున్నానా! చూస్తున్నారు కదా. ఖర్చు మీద ఖర్చు! ఇలా వంద నోటు తీస్తే నోటుని కాల్చినంత వేగంగ ఖర్చయిపోతోంది. నన్నేం చేయమంటారు చెప్పండి. ఇంటి అద్దె, పాల డబ్బాలు బియ్యం... వీటికన్నా కనబడని ఖర్చే ఎక్కువ... నేను చేయలేను బాబు ఈ సంసారం... ఈ రోజు నుంచి మీరే ఎత్తండి. మీరు జీతం నాకు పైసా ఇవ్వొద్దు. దేనికది ఇంట్లో సరుకు తెచ్చిపడేయండి. నేను వండి పడేస్తాను."

అదిరిపడ్డాడు సూర్యం!

అంత పని చేస్తే ఇంకేమైనా ఉందా!

సరోజని దగ్గరికి తీసుకొని "నాకు తెల్సు సరూ. నీవు కాబట్టి ఒక లైన్‌లో పద్ధతిగా జీతాన్ని నెల నెలంతా సర్దుకొస్తున్నావు, అదే నేనైతే బాక్సింగ్‌లో ఫస్ట్ స్ట్రోక్‌కే నాకవుట్‌లా - నెల్లో తొలి వారం ఖర్చుకే నేల పడిపోయి వన్,టూ,త్రీ.. అంటూ వంద లెక్కపెట్టినా లేవలేను... వెధవ మాంసం పావు కేజీ ఎగ్‌స్ట్రా వల్లే గదా సంసారం ఎత్తనని పెద్ద పెద్ద మాటలనేస్తున్నావ్. పావు కూడా తేను, అర్థపావు తెస్తాను. నీవు మాత్రం మాటమాటకీ - ఆ మాట అనకు సరూ" అని గెడ్డం పట్టుకున్నాడు.

సరోజ వట్టి అమాయకురాలు. సూర్యం గుండెలపై వాలిపోయింది. ముక్కు ఎగబీలుస్తూ - "మీరు కోరిన తిండి పెట్టలేకపోతున్నాను పాపిష్టి దాన్ని. ఫర్వాలేదులెండి. అరకేజీ తెండి" అంది.

"వద్దులే సరూ... జీతాలకి తెచ్చుకోవచ్చు."

"లేదు, లేదు.. అరకేజీ తెండి"

"ఎందుకులెద్దూ"

"తెమ్మంటున్నది మిమ్మల్నే"

"తెస్తాను - కాని పావుకేజీ"

"కాదు అరకేజీ"

"లేదు పావుకేజీ"

ఇలా సాగుతున్న బండి - వస్తున్న అత్తగార్ని చూసి ఆగిపోయింది.

✿ ✿ ✿

అత్తగారు మొన్నంటే మొన్న వచ్చి ఈ రోజు వెళ్ళిపోతారట.

వెళ్ళిపోతున్న ఆమెను 'వెళ్లొద్దెళ్లొద్దు ఓ రెండు రోజులుండండి' అనేస్తే గబుక్కున ఆమె ఎక్కడ వుండిపోతుందోనని భయం!

సరోజ భయం భయంకరంగా, దారుణంగా తోచింది సూర్యంకి.

ఈ సరోజే పది రోజుల కిందట ఏవింటంది?

"మా అమ్మ రోజూ కల్లోకి వస్తుందండీ, వచ్చే కలలన్నీ పీడకలలండీ, నాకెందుకో భయమేస్తుందండీ. మా అమ్మకెలా వుందో ఏవిటో... ఒకసారి చూడాలని వుందండీ" అని ఒక రోజు కాదు, వరుసగా నాలుగైదు రోజులుగా గోలపెట్టింది.

'మా అమ్మని చూడా'లంటూ చంటిపిల్లలా రెండు, మూడుసార్లు ఏడ్చేసింది కూడా!

"దానికంత బాధపడడం ఎందుకూ, వెళ్ళి చూసిరా" అన్నాడు సూర్యం.

చూసిరా అంటే ఇక్కడా, అక్కడా కాదు. విశాఖ నుంచి విజయవాడ.

ఛార్జీలు బోల్డు పోయాలి.

"ఫర్వాలేదు, ఖర్చు అయితే అవనీయ్, నీవెళ్ళు" అంటే 'మీకేం అప్పులు చేసేస్తారు. డబ్బంటే మీకు మంచినీళ్లు" అంది.

మరెలాగ!

"అన్నీ నీవే అనేస్తే ఎలా సరూ! పోనీ ఒక పని చేయి. నీవు స్వయంగా మీ అమ్మకో వుత్తరం రాయి. నిజంగా బాగోలేదని రిప్లయి వచ్చిందనుకో... అప్పుడు వెళ్ళొచ్చు. ఏవంటావ్"

ఆ సలహా నచ్చింది సరోజకి.

వెంటనే ఉత్తరం రాసింది. రోజూ వస్తున్న పీడకలలూ.. రెండు, మూడు సార్లు ఏడ్చిన సంగతీ... తనని చూడాలనే అతి తీవ్రమైన కోరికా - ఇవన్నీ రాయడమేగాక మొన్న మొన్న బాత్రూంలో జారిపడిపోయినట్టు, అప్పటి నుంచి మక్క సలుపు, గుండె నొప్పితో బాధపడుతున్నట్టు చేర్చింది ఆ ఉత్తరంలో.

దాంతో బేంబేలెత్తిపోయి, ఉత్తరానికి జవాబుగా ఏకంగా తల్లే కూతురు దగ్గరికి వచ్చేసింది!

వచ్చేయడం వచ్చేసింది గాని, రావడానికి ముందు చాల తతంగం జరిగింది. ఆమె కొడుకు దగ్గర వుంటోంది. కూతుర్ని చూడ్డానికి వెళ్తానంటే 'ఎందుకూ అంత అవసరం ఈ ఉత్తరంలో కనబడ్డంలేదు. వస్తే దాన్నే రమ్మను' అన్నాడు కొడుకు. 'ముక్క నొప్పితో, గుండె నొప్పితో అదేం వస్తుందిరా' అని చీవాట్లేసింది తల్లి. అతను తల్లిని పంపడానికి ఎందుకిష్టం లేదంటే కారణం ఆర్థిక ఇబ్బందులు కావు. తనకి ముగ్గురు పిల్లలు. వాళ్ళు పిల్లలు కాదు రాక్షసులు. రాక్షస పిల్లలని బాధపడడం తప్ప సముదాయించడం తెలీదు శ్రీమతికి. పిల్లల మీద దెబ్బ పడితే భరించలేడు తను. తల్లి వుంటే ఆ బాధ లేదు. పిల్లల మీద దెబ్బ పడకుండా కంటికి రెప్పలా చూసుకుంటుంది. అంతకు తప్పించి పెద్ద కారణం లేదు. చివరికి ఒకటీ, రెండు రోజుల కన్నా ఎక్కువ రోజులుండనన్న షరతు మీద తల్లిని రైలెక్కించేడు కొడుకు.

తల్లిని చూడగానే సరోజకి సంబరమైపోయింది.

అన్నయ్య ఒకటీ రెండు రోజులుండి వచ్చేయమన్నాడని చెబితే 'అదేం వీల్లేదు. వారం, పది రోజులుండాల్సిందే. నేను రాస్తాలే అన్నయ్యకి ఉత్తరం' అని సరోజ అంటే తల్లి ఉప్పొంగిపోయింది. నవ్వేసి వూరుకుంది.

వచ్చినకాన్నించీ ఒక్క క్షణం కూడా తల్లిని వదల్లేదు.

ఆ ఉత్సాహంలో, ఆ ఆనందంలో భర్తను రెండు రోజులు సెలవు పెట్టమంది. తల్లిని సింహాచలం తీసుకెళ్దామంది. ఫోర్ట్, బీచ్ చూపిద్దామంది. సరోజ అంత హుషారుగా వుండడం ఈ మధ్య ఎపుడూ చూడలేదు సూర్యం.

ఆ కబుర్లు, ఈ కబుర్లతో పూర్తిగా ఒక రాత్రి, ఒక పగలూ తల్లిని అంటుకుపోయింది సరోజ.

120 రూపాయల అద్దె తగలేస్తే ఒక్కగానొక్క గది. ఆ గదిలోనే అందరి పడకలు! రెండో రోజు రాత్రి తల్లితో కబుర్లాడి అలసిపోయేక మొగుడు పక్కలోకి వెళ్ళిపోవాలని పించింది సరోజకి.

చాప మీద తల్లి పక్కన పడుకున్న తనని మంచం మీద నుంచి మొగుడు రెండు, మూడు సార్లు గిల్లేడు. పిల్లలంటే ఫర్వాలేదు. తల్లి వుండగా మొగుడు పక్కలోకి ఏం వెళ్తుంది? తల్లి అవరోధంగా కన్పించింది సరోజకి!

అంతకన్న ముఖ్యవిషయం ఏమిటంటే ఎకనమిక్స్!

మరో మనిషి సడన్‌గా వచ్చి జాగర్తగా ప్లాను చేసుకన్న బడ్జెట్‌ని తలకిందులు చేయడం!

సరోజ లెక్క ప్రకారం అన్ని ఖర్చులూ పోను, నెలాఖరికి ఓ యాభై, అరవై మిగలాలి. అలా మిగిలేటట్లు ప్రతి నెలా ప్లాన్ చేస్తూనే వుంది. కాని పైసా మిగలడం లేదు. పైగా పదీ, పరకా అప్పు చేయాల్సి వస్తోంది. తను అనుకున్నట్టుగా డబ్బు మిగిల్తే కట్టుచీర ఒకటి కొనుక్కుందామని గత 6 నెలలుగా అనుకోవడమే గాని - అవ్వడం లేదు.

వచ్చే నెల పుష్కరాలు. రాజమండ్రి వెళ్ళాలి. అదొక ఖర్చు అనుకుంటే –

ఈ నెల అమ్మ దిగింది! ఇంకేం చీర!

తెలీకుండా బోల్డు ఖర్చు! నిన్న సరదాపడి అమ్మని తీసుకొని సినిమాకెళ్తే... సరదా వదిలిపోయింది! దాంతో సింహాచలం, ఫోర్టు, బీచ్ చూపించడానికి భర్తను సెలవు పెట్టించడం గుర్తు చేసుకుంటే గుండె బేజారైపోయింది.

లెక్కవేస్తే.. ఈ రెండు రోజుల్లోనే 50 రూపాయలు ఆరిపోయినట్టు తేలింది.

ముందుకింకెంత ఖర్చో అని హడలిపోతున్న సమయంలో –

"అమ్మాయ్! ఈవేళ మెయిలుకి వెళ్ళిపోతానే. కాదనకు. అన్నయ్య కోపం నీకు తెల్సుకదా. పిల్లలు కూడా నా గురించి బెంగపెట్టేసుకున్నారేవోఁ. నేను బయల్దేరుతుంటే ఒకటే ఏడుపు. వాళ్ళనొదిలి వుండలేనే! ఈవేళ మెయిలుకి వెళిపోతాను. ఏం అనుకోకు. మరోసారి వస్తా కదా." అంది తల్లి.

"నీవలా అంటుంటే ఇంకేవంటాను. నీ యిష్టవమ్మ" అంది సరోజ, పొడిగా.

❁ ❁ ❁

తల్లి మెయిలుకి బయల్దేరుతుంటే నిజంగానే ఏడ్చేసింది సరోజ

'ఛీ. పాడు ముండని... తల్లిని రెండు రోజులుంచుకోలేనా.. ఛీఛీ'

తనపై తనకే అసహ్యం వేసింది.

"వస్తానమ్మాయ్, ఆరోగ్యం జాగర్త. పిల్లలిద్దరూ జాగర్త. వీలు చూసుకొని బెజవాడొకసారి రా. వారం, వారం ఉత్తరం వేయడానికి బద్దకించకు. వస్తాను" అంటూ పిల్లలిద్దర్నీ ముద్దులాడి తల్లి బయల్దేరుతుంటే సరోజ దుఃఖం ఆగలేదు.

తల్లిని కౌగలించుకు ఏడ్చేసింది.

"అమ్మా! వుండిపో అమ్మా. రెండు రోజులుండి వెళ్దువుగానమ్మా. అన్నయ్య ఏం అనడమ్మా. నేను ఉత్తరం వేస్తానమ్మా. నీకు మనవలు వాళ్ళేగాని వీళ్ళు కారేటి? నా మాట విని వుండిపోవమ్మా. అమ్మా! అమ్మా" అని నిజంగానే బతిమాలింది.

కాని సమయం మించిపోయింది.

సూర్యం అపుడే రిక్షా తీసుకొచ్చి అత్తగారి లగేజ్ రిక్షాలో పెట్టటం కూడా జరిగిపోయింది. రెండు రోజులకే చేరికైపోయిన మనవడు, మామ్మ వెళిపోతుందని గ్రహించి ఏడుస్తూ వెంటపడ్డాడు. వాడిని వెనక్కి లాక్కొచ్చింది. వూరడించింది. కాని తన మనసుని వూరడించలేకపోతోంది!

రిక్షాపై వెళ్ళిపోతున్న తల్లి అడుగడుగూ దూరమవుతూంటే సరోజకి దిగులు పెరిగి కడుపు దేవేసినట్టయింది.

❁ ❁ ❁

గోదావరి పుష్కరాలు!

సూర్యం, సరోజ ఇద్దరు పిల్లలతో రైలెక్కారు.

రైల్లో కాలక్షేపానికి పత్రిక కొన్నాడు సూర్యం.

పత్రిక నిండా అప్పుడే పుష్కలంగా పుష్కరాలపై కథలూ, కార్టూన్లు.

ఆ కథలూ, కార్టూన్లు ఏం చెబుతున్నాయి?

పుష్కరాల పేరిట గవర్నమెంటు అమాయక ప్రజను ఎంతలా పీడిస్తున్నదీ, సిటిబస్సు ఎక్కినా, అది పట్టుకున్నా, ఇది ముట్టుకున్నా సుంకం సుంకం అంటూ ఎంతగా వేధించుకుతింటున్నదీ, యాత్రికులు సదుపాయాలు లేక ఎన్ని ఇబ్బందులకి లోనవుతున్నదీ - ఇలాంటి వాటిపై ఏ కథా, కార్టూను లేదు. వాటిల్లో వున్నది ఏవిటంటే పుష్కరాల పేరుతో చుట్టాలు రాజమండ్రి నివాసులను తెగ ఇబ్బంది పెట్టేస్తున్నారట!

ముఖ్యంగా అందులో ఒక కార్టూన్ చూసేక... రావులమ్మ పిన్ని ఇంటికి వెళ్ళడానికి జంకు వేసింది సూర్యంకి.

ఆ కార్టూన్ని సరోజకి చూపించేడు.

చుట్టాల దాడి భరించలేక ఒక ఇల్లాలు ఇంటికి తాళాలు వేసేసి.. ఇంటిల్లిపాది పారిపోతున్న దృశ్యం.

"ఈ వెధవ జోక్కి నవ్వాలి మనం! ఏం చేస్తాం, మన జోకుల స్థాయి అంతలో వుంది! సరూ, యీ కార్టూన్లు చూస్తుంటే... మా పిన్నిగారింటికి వెళ్ళడం మానేయడం బెటరనిపిస్తోంది. ఆ మాటకొస్తే నాక్కూడా ఎందుకో గిల్టీగా వుంది" అన్నాడు సూర్యం.

"గిల్టీ లేదు, బోల్టూ లేదు. బొమ్మలకి నవ్వేసి అవతలికి పారెయ్యక బాధపడతారేవిటి! మరీ అంత సున్నితమైతే ఎలాగండి బాబూ" అని వెళ్ళబోయే చుట్టాలింటికి, వాటి మీద కార్టూన్లకీ ఏ మాత్రం సంబంధం లేదని ఈజీగా తేల్చేసింది సరోజ.

రైలు ఆగింది.

రాజమండ్రి స్టేషనంతా జనం జనం. ఇసక వేస్తే రాలని జనం.

రిసీవ్ చేసుకోవడానికి చిన్నాన్నగాని, మరెవరుగాని వచ్చిన జాడ కనిపించలేదు. ఏ బండికి వస్తున్నదీ ముందుగానే వ్రాసాడు తను.

చిన్నాన్న అంటే సూర్యం తరపు చుట్టం. స్వయాన పినతండ్రి. పేరు - సత్యారావ్. లోకోషెడ్డులో ఫిట్టరు. జీతం తక్కువ. పిల్లలు అతనికి ఒకరు కాదు, ఇద్దరు కాదు... ఆరుగురు! అతని ఆర్థిక స్థితి ఇబ్బందికరమైనదని తనకి తెల్సు. అంచేతనే పుష్కరాల తతంగం ఎప్పుడయిపోతే అప్పుడు వెంటనే రైలు ఎక్కేయాలని బయల్దేరినపుడే అనుకున్నాడు.

చిన్నాన్న ఇంటికిపుడు వెళ్ళడమా మానడమా!

స్టేషనుకి ఎవరూ రాలేదంటే - చుట్టాలు రావడం ఇష్టం లేదనే కదా అర్థం!

ఎవర్నని ఏం లాభం! రోజులలాగున్నాయి. కుటుంబం నుంచి కుటుంబాన్ని, మనిషి నుంచి మనిషినీ విడదీసి, వేరు చేసి... ఎవరికి వారిని ఏకాకిని చేస్తూ ఏడిపిస్తున్న రోజులు.

అశాంతికీ, స్వార్థానికీ, ఆత్మవంచనకీ గురిచేస్తున్న రోజులు. బంధువులు బరువుగా, భయంగా తోస్తున్నారు. కావల్సిన వాళ్లు పరాయి వాళ్ళయిపోతున్నారు.

అయితే ఎంతటి పరాయివాళ్ళనైనా ఇంటికొస్తే ఎంతగానో ఆదరించి తనకు లేకపోయినా వున్నదంతా అతిథికి పెట్టి చక్కని ఆతిథ్యం ఇచ్చే సంస్కృతి మనది. ఆ సంస్కృతిని ఈ వ్యవస్థ ఎంత దెబ్బ కొట్టినా మనుషులు మృగాల్లా అయిపోకుండా మానవత్వం నిలబెట్టుకునే అవకాశం ఇంకా కొంత మిగిలే వుందని అనుకుంటాడు సూర్యం.

"ఏవండీ మీ చిన్నాన్న!" అంది సరోజ సంబరంగా.

ఆ మాట వినేటప్పటికి సూర్యం ప్రాణం లేచొచ్చింది.

సత్యారావు ముందుగా సూర్యం, సరోజలను పలకరించి, బాబుని ముద్దాడి సరోజ చేతిలోంచి పాపను తీసుకొని ఎత్తుకుంటూ "స్టేషన్‌కి బండి రాక ముందే వచ్చాను సూర్యం! రష్‌లో మిమ్మల్ని కనుక్కోలేకపోయేను. ఈ మధ్య చూపొకటి దెబ్బతింది. కళ్ళు సరిగా కానరావడం లేదు" అన్నాడు.

"కేటరాక్టా!"

"అవును. ఆపరేషన్ తప్పదట... వీలు చూసుకొని అనపర్తిలో చేయించుకోవాలనుకుంటు న్నాను"

"అనపర్తి ఎందుకూ! వైజాగ్‌లో చేయించుకో చిన్నాన్నా... మంచి స్పెషలిస్టులున్నారు" అని సూర్యం అంటుంటే 'నోర్మూసుకోండి' అన్నట్టు కాలు తొక్కింది సరోజ.

కోపం వచ్చింది సూర్యంకి.

తనేదో అన్నంతలోనే... చిన్నాన్న వైజాగ్ అప్పుడే వచ్చేస్తున్నట్టు... వైజాగ్ రావడం అంటే తన ఇంట్లో తిష్టవేయడానికే అన్నట్టు - ఏవిటామె ప్రవర్తన! ఎందుకంత హడలు! అలాగైతే మనల్ని చూసి వీళ్ళూ హడలిపోవాలి కదా!

❀ ❀ ❀

హడలిపోలేదు రావులమ్మ.

ఇంటికొచ్చిన చుట్టాలని ఎంతో సాదరంగా, ఆప్యాయంగా ఆహ్వానించింది.

అది చిన్న పెంకుటిల్లు. సొంతదే గాని, చాలా పాత కొంప. అది ఎప్పుడేసిన పెంకో.. చూరు దగ్గర పెంకులన్నీ రాలిపోయినై. ఇంటి ముందు... పారని మురికి కాలవ.

ఆరుగురు పిల్లలూ మురిగ్గా లేరు. ఉతికిన దుస్తుల్లో శుభ్రంగా వున్నారు. అయితే ఆ దుస్తులు చాలా చవక రకంవి... సరిగ్గా చూస్తే కుట్టుకున్న చిరుగులు కూడా కనిపిస్తాయి. పిల్లలంతా తల్లి క్రమశిక్షణలో మంచి నడవడిక అలవర్చుకున్న పిల్లలు.

ఆ ఇంటికి రావడం సూర్యంకి కొత్త కాదు గాని సరోజకి కొత్తే.

రాగానే ఆ ఇల్లునీ, మనుషుల్నీ చూసి భయపడింది గాని.. ఆ ఒక్క రోజులోనే వాళ్ళు ఎంత మంచివాళ్ళో... ఎంత మర్యాదస్తులో అర్థం చేసుకోగలిగింది. ప్రతి నిముషం పైస,

పైసకీ ఇబ్బంది పడినా – చుట్టాలను ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా తన స్థాయిని మించిన సదుపాయాలు చేయడం గమనించగలిగింది.

పుష్కరాల తంతు ముగిసేక వెళ్ళిపోడానికి ఆయత్తమవుతుంటే అదేం వల్ల కాదంటూ మూడు రోజులపాటు బలవంతంగా వుంచేసింది రాములమ్మ.

ధవళేశ్వరం ఆనకట్ట, సారంగధర మెట్ట... చూపించేడు సత్యారావు. ఒక రోజు ఆగితే పేపరు మిల్లు కూడా చూపిస్తానన్నాడు.

సెలవు లేదని చెప్పి – నాలుగో రోజున బయల్దేరారు.

బయల్దేరుతూ –

"మేవొచ్చి మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాం" అంది సరోజ.

పిచ్చి కోడలా! ఏవో ఇబ్బందులనేవి ఎప్పుడూ వుండనే వుంటాయి. అలా అని ఇబ్బందులు పెట్టడానికి చుట్టాలు రారు కదా. (చుట్టాల్లో వేధించేవాళ్ళు లేరని కాదు. కాని చుట్టాలందర్నీ వేధించే వాళ్ళు గానే జమ కట్టేస్తే ఎట్లా!) ఎన్నిసార్లు పిలిస్తే మటుకు మీరొచ్చేరు? పుష్కరాలు గనక వచ్చేరు. అంతేగాని కత్తి కట్టి మమ్మల్ని ఇబ్బంది పెట్టడాని కొచ్చారని ఎలా అనుకుంటాం! పుష్కరాల పుణ్యమా అని వచ్చిన మీరు మాతో మూడు రోజులూ సరదాగా గడిపినందుకు మా అందర్కీ ఎంత సంతోషంగా వుందో – అనే తన భావం మాటల్లో చెప్పలేకపోయింది. మాటల్లో చెప్పలేని భావాన్ని చెమర్చిన కళ్ళతో చూపగలిగింది రావులమ్మ. చూడగలిగింది సరోజ.

"ఒక్క నిమిషమాగు తల్లి" అని రావులమ్మ లోనకెళ్ళి వచ్చింది.

కుంకుమ బరిణె తెరిచి సరోజ నుదుట ఎర్రటి బొట్టు పెట్టింది.

పసుపూ కుంకాన్ని, చీర, రవిక గుడ్డతో ఇవ్వబోయింది. రావులమ్మ అత్త చీర పెడుతుందనేది వూహించని స్థితి. కదిలి పోయింది మనిషి! "ఏవింటత్తయ్యా ఇదంతా" అని పుచ్చుకోడానికి ససేమిరా ఇష్టపడలేదు సరోజ.

"నా సంతోషం తల్లీ. కాదనకు"

సత్యారావూ, పిల్లలూ సరోజ వైపు ఎంతో ఆప్యాయంగా చూస్తున్నారు. ఆ చూపులు చీరని తీసుకోమంటున్నాయ్.

రావులమ్మ మొహంలో కెందుకో చూడలేకపోతోంది సరోజ.

ఆమె ఆదరాభిమానాల వర్షంలో తడిసి ముద్దయిపోతూ ... తలెత్తుకోలేని స్థితిలో ఉంది సరోజ.

కళ్ళంట నీళ్ళు!

ఆరేడు నెలల నుంచి... ఎప్పటికప్పుడు.. చీరె కొనాలనుకుంటూనే కొనలేకపోయింది. చీర కొనాలనే కోరికను పెరిగే ధరలు కబళించేస్తే ఏం చేయలేని తను, పెరిగిపోతున్న ఖర్చుని అదుపు పెట్టే శక్తి లేని తను.. చుట్టాలంటే అమ్మబాబోయ్ అని భయపడి కన్నతల్లినే

రెండు రోజులుంచుకోలేక పోయింది. అలాంటి తనకు రావుఁలమ్మత్త పేద సంసారాన్ని ఈదుతూనే.. ఎంతగానో ఆత్మీయత చూపి, చీర, రవికల గుడ్డ పెడ్తుంటే... పుచ్చుకోడానికి సిగ్గేసింది సరోజకి.

“తీసుకో కోడలా... పేద్దాన్ని... పట్టుచీరలు పెట్టలేను. మాకు తోచింది. మా సంతోషాన్ని కాదనకు. కాదంటే మమ్మల్నందర్నీ బాధపెట్టిన దానివవుతావు.”

“అభిమానంతో ఇచ్చిన చీర ముందు పట్టుచీరలేం నిలబడతాయి అత్తా.”

ఆమె మొహం చూస్తు, చూస్తూ కాదనే సాహసం లేక సిగ్గుపడుతూ, చీర పుచ్చుకుంది. కళ్ళు తుడుచుకుంది.

“పిల్లలందర్నీ తీసుకొని ఒకసారి రండత్తయ్యా – తప్పక రావాలి. రాకపోతే నా మీద ఒట్టే” అంది సరోజ.

చిన్న పిల్లల చేతిలో తలా 5 రూపాయలు పెట్టింది. పుచ్చుకునేదాకా వదిలింది కాదు సరోజ.

“వస్తానత్తయ్యా” అంటూ సెలవు పుచ్చుకొని రిక్షా ఎక్కుతున్నప్పుడు రావుఁలమ్మత్త కళ్ళలో నీళ్ళు చూసింది సరోజ.

ఆ రోజు తల్లి రిక్షాపై వెళ్ళిపోతున్నప్పుడు ఎంతగా బాధపడిందో, ఈరోజు రావుఁలమ్మత్తని వదిలి వెళిపోతుంటే అంతే బాధ కలిగింది సరోజకి.

రిక్షా కదుల్తుంటే పిల్లలు చేతులూపేరు.

❁ ❁ ❁

రైలెక్కించడానికి స్టేషను దాకా వచ్చేడు సత్యారావు.

అతను పిల్లలకి బిస్కట్ ప్యాకెట్ కొందామని – జేబులో చేయి పెట్టి నాలుగు చిల్లర నోట్లు తీసాడు. ఆ నోట్లలో రూపాయి నోటేదో, రెండు నోటేదో.. కళ్ళు చికిలించి, మరీ దగ్గిరగా పెట్టుకొని, చూస్తే గాని తెలియడం కష్టమయింది.

అది చూసిన సరోజకి ఏదో గుర్తొచ్చినట్టయి –

అప్పుడే పేపరు కొని చూస్తున్న సూర్యాన్ని ‘ఏవండి, చిన్నమాట’ రహస్యంగా పిలుస్తున్నట్టు, అతి నెమ్మదిగా పిలిచింది సరోజ.

దగ్గరకెళ్ళి ఏవిఁటన్నట్టు చూశేడు.

“అది కాదండీ.. చినమావయ్యగారు కంటి ఆపరేషన్ చేసుకోడానికి... మనూరు రమ్మని చెప్పండి... మిమ్మల్నే! అలా మట్టిబుక్కడంలా చూస్తారేం?..... ఎవరూ లేనట్టు ఏ అనపర్తిలోనో ఎందుకూ? వైజాగైతే దేనికేదైన మనముంటాంగదా. ఏవంటారు?”

ఏవంటాడు? ఆశ్చర్యంగా చూస్తు వుండిపోవటం తప్ప!

ఈ బుద్ధి వైజాగ్ వెళ్లిందాకా ఉంటుందా?

సరోజ మొహం చూస్తే ఉంటుందనే అనిపించింది సూర్యంకి. ❁